ఈనాడు
బాపట్ల
శుక్రవారం అక్టోబరు 4, 2024

ఆలస్యం ఖరీదు.. రూ. 176 కోట్లు

గుంటూరు వాహిని ఆధునికీకరణకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2019 ప్రారంభంలో రూ.378 కోట్లను మంజూరుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. టెండర్లు పిలిచి గుత్తేదారుతో ఒప్పందం చేసుకునే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ఆగిపోయింది. వైకాపా అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా పనులు అడుగు ముందుకు పడలేదు. దీంతో వైకాపా పాలనలో ఐదేళ్లపాటు ప్రాజెక్టు మూలన పడింది.

* అమాంతం పెరిగిన గుంటూరు వాహిని విస్తరణ వ్యయం
* వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితం


గుంటూరు వాహిని

ఈనాడు, బాపట్ల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వాహిని విస్తరణ పనులపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమీక్షించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ప్రాథమికంగా అంచనాలు సిద్ధం చేయగా రూ.554 కోట్లకు అంచనాలు పెరిగాయి. సకాలంలో పనులు ప్రారంభించి పూర్తిచేసినట్లయితే రూ.378 కోట్లతోనే కాలువ విస్తరణ పూర్తయ్యేది. రైతులకు ఉపయోగపడటంతోపాటు ప్రభుత్వానికి అదనపు భారం తప్పేది. ఇందుకు భిన్నంగా ఆలస్యం చేయడం వల్ల రూ.176 కోట్ల అంచనా వ్యయం అదనంగా పెరిగింది.

దశాబ్దాల కల

గుంటూరు వాహిని ప్రస్తుతం 47 కిలోమీటర్లు ఉండగా, దానిని మరో 30 కిలోమీటర్లు పొడిగించి మరింత ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో గత తెదేపా ప్రభుత్వం గుంటూరు వాహిని పొడిగింపు, విస్తరణకు వేర్వేరుగా టెండర్లు పిలిచింది. పొడిగింపు పనులకు టెండరు ప్రక్రియ పూర్తయి గుత్తేదారుకు పనులు అప్పగించింది. విస్తరణ పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ దశలో 2019 సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకుండా పక్కన పడేసింది. రైతులు పాదయాత్ర చేసినా, ధర్నాలు చేసి వాహిని విస్తరించాలని డిమాండ్ చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా గుంటూరు వాహిని, విస్తరణ పొడిగింపు పనులు పూర్తిచేస్తామని ప్రకటించింది. ఈమేరకు తాజా ధరలకు అనుగుణంగా అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాలువ పనులకు సంబంధించి కదలిక వచ్చింది.

కాలువ సామర్థ్యం పెంపు

గుంటూరు వాహిని ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రారంభమై వట్టిచెరుకూరు మండలంలోని గారపాడు వరకు 47 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని పొడిగించడం ద్వారా బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందుతుంది. కాలువ ప్రారంభంలో ప్రస్తుతం ఉన్న ఆకృతి ప్రకారం 600 క్యూసెక్కుల సామర్థ్యంతో మొదలై చివరకు 100 క్యూసెక్కుల సామర్థ్యంతో ముగుస్తుంది. కాలువ ప్రారంభంలో 600 నుంచి 750 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతూ గారపాడు వద్దకు 350 క్యూసెక్కుల నీరు తీసుకెళ్లాలనేది ప్రణాళిక. కాలువలో నీటిప్రవాహ సామర్థ్యం పెంచడంతోపాటు ఇరువైపులా గోడలు నిర్మించడం ద్వారా నీటివృథాకు అడ్డుకట్ట వేస్తారు. ప్రారంభంలో 15 మీటర్లు వెడల్పు ఉన్న కాలువను 18 మీటర్లకు విస్తరిస్తారు. ఇప్పటికే కాలువ కింద ఉన్న ఆయకట్టు 27వేల ఎకరాల స్థిరీకరణ, 33 గ్రామాలకు తాగునీటి అవసరాలు తీరనున్నాయి. కాలువ ఆధునికీకరణ చేస్తే సామర్థ్యం పెంపుతోపాటు నీటివృథా తగ్గుతుంది. అదే సమయంలో సమీపంలోని గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి వచ్చి కలుస్తున్న మురుగునీరుకు అడ్డుకట్ట పడుతుంది. కాలువ ప్రాధాన్యం దృష్ట్యా పనులు చేపట్టడానికి అడుగులు పడుతున్నాయి. గుంటూరు వాహిని 47వ కిలోమీటరు నుంచి 76.40 కిలోమీటర్లు వరకు పొడిగిస్తారు. దీనివల్ల బాపట్ల జిల్లాలో అదనపు ఆయకట్టుకు నీరందించడంతో పాటు పదుల సంఖ్యలో గ్రామాలకు తాగునీటి సౌకర్యం లభిస్తుంది. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెండరు పూర్తయి భూసేకరణ ప్రక్రియ దశలో ఉంది. విస్తరణ, పొడిగింపు పనులు పూర్తయితే వారి ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల నెరవేరనుంది.

బాపుడా వైస్ ఛైర్మన్‌గా జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్‌గా జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన బాబూరావు బదిలీపై ఒంగోలు వెళ్లారు. ఇప్పటి వరకు ఈ పదవి ఖాళీగా ఉంది. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

పారదర్శకంగా మృతుల ఓట్లు తొలగింపు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, న్యూస్‌టుడే: సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాలో పారదర్శకంగా మృతుల ఓట్లు తొలగిస్తున్నట్లు కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాపై కసరత్తు ప్రారంభించామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఈ ప్రక్రియ సాగుతుందని అందరూ సహకరించాలని కోరారు. 1500 మంది ఓటర్లు దాటితే ఆ ప్రాంతంలో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న నిబంధన మేరకు జిల్లాలో కొత్తగా ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ఈసీకి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఇప్పటి వరకు 6,439 దరఖాస్తులు రాగా, విచారణ వేగంగా చేస్తున్నామన్నారు. 623 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వివరించారు. కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన విడుదల కానున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితా రద్దైందన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం ముసాయిదా ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామన్నారు. తదుపరి అభ్యంతరాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని, డిసెంబరు 30న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా, పర్చూరు ఈఆర్వో చంద్రశేఖర్, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

విపత్తులో నష్టపోయిన వారందరికీ పరిహారం

బాపట్ల, న్యూస్‌టుడే: వరద విపత్తులో జిల్లాలో నష్టపోయిన వారందరికీ పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ కె. వెంకట మురళి అన్నారు. వరద బాధితులకు పరిహారం పంపిణీపై కలెక్టరేట్ నుంచి టీసీ ద్వారా జిల్లా అధికారులతో ఆయన గురువారం మాట్లాడారు. సాంకేతిక కారణాల వల్ల పరిహారం అందని అర్హులైన వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గృహాలు దెబ్బతిన్నవారికి పరిహారం ఇవ్వాలన్నారు. దెబ్బతిన్న 815 వాహనాలకు బీమా పరిహారం వచ్చేలా చూడాలని ఆదేశించారు. నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు బీమా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలను బ్యాంకర్లు రీ షెడ్యూల్ చేయాలని చెప్పారు. ఆధార్ కార్డులు బ్యాంకు ఖాతాతో అనుసంధానం కాకపోవటం వల్ల అర్హులకు రూ.18 లక్షల పరిహారం అందలేదన్నారు. దెబ్బతిన్న 13 వాహనాలు, గేదెల షెడ్డులకు పరిహారం రాలేదని తెలిపారు. వివిధ కారణాలపై 203 మందికి పరిహారం నిలిచిపోవటంపై ఆరా తీశారు. తక్షణమే వారి వద్దకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. పరిశీలన, పర్యవేక్షణ బాధ్యత ఆర్డీవోదేనన్నారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో సత్తిబాబు పాల్గొన్నారు.


జగజ్జననికి జేజేలు

దసరా సంబరాలు ఊరూవాడా ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. – న్యూస్‌టుడే బృందం


అద్దంకి: బాలాత్రిపురసుందరీదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు


చీరాల సంతబజారులో అమ్మవారికి అభిషేకం చేసేందుకు జలాలను తీసుకెళ్తున్న మహిళలు


మేదరమెట్లలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో..


మార్టూరు మండలం జొన్నతాళిలో కనక దుర్గమ్మ..

జాగ్రత్తలు తీసుకోకుంటే 24 శాతం మందికి మధుమేహం ముప్పు


మోనిషాకు ప్రతిభ ధ్రువపత్రం అందజేస్తున్న ఫణీంద్ర

గుంటూరు: జాగ్రత్తలు తీసుకోకపోతే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో 24 శాతం మందికి మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని కాటూరి వైద్య కళాశాల హౌస్‌సర్జన్ మోనిషా బోడాల చేసిన పరిశోధనలో తేలింది. గ్రామీణ ప్రాంత ప్రజల్లో హైపర్ ఇన్సులినిమియాపై ఆమె సమర్పించిన పరిశోధనా పత్రానికి జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కడం గమనార్హం. ఎయిమ్స్ రిషికేష్‌లో గత నెల 28, 29 తేదీల్లో నేషనల్ ఫ్యామిలీ మెడిసిన్, ప్రైమరీ కేర్ 6వ జాతీయ సదస్సులో మోనిషా పాల్గొంది. కాటూరి వైద్య కళాశాల నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రత్తిపాడు శివారు కాలనీల్లో నివసిస్తున్న వారిలో మధుమేహ సమస్య లేని 100 మందిని పరిశోధనకు ఎంపిక చేసుకుంది. వీరి నుంచి రక్త నమూనాలు సేకరించి క్రాఫ్ట్ పరీక్ష నిర్వహించారు. ఇందులో హైపర్ ఇన్సులినిమియా 24 శాతం మందిలో ఉన్నట్లు తేలింది. జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని నిర్ధారణ జరిగింది. వారందరి ఇళ్లకు వెళ్లి జీవనశైలిలో మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు వివరించారు. జాతీయ స్థాయిలో అవార్డు గెలుచుకుని కళాశాలకు వచ్చిన మోనిషాను గురువారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి ఆచార్య ఫణీంద్ర కళాశాల ఛైర్మన్ స్వైరారావు, డీన్ వరప్రసాద్, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ మోహనరావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

కారంచేడు వాసులకు స్వచ్ఛ జలాలు

* ఎంపీ పురందేశ్వరి చొరవతో రూ.75 లక్షలతో సిద్ధమైన నీటి పథకం
* రూ. కోటితో నిర్మించే మరో పథకానికి నేడు శంకుస్థాపన


కారంచేడులో సిద్ధమైన శుద్ధజల పథకం షెడ్డు

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన భారీ నీటి సరఫరా పథకం ప్రారంభానికి సిద్ధమైంది. కారంచేడు వాసులు దశాబ్దాల కాలంగా స్వచ్ఛ జలాలు అందక పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చూపిన చొరవతో గ్రామస్థులకు నీటి కష్టాలు తీరనున్నాయి. గత ఏడాది డిసెంబరులో ఓఎన్‌జీసీ సహకారంతో గ్రామంలోని గ్రంథాలయం ఉన్న చెరువుల వద్ద నిత్యం లక్ష లీటర్ల సామర్థ్యంతో నడిచే కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (వాడుకకు, తాగునీటికి) నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఇందుకు ఆ సంస్థ రూ.75 లక్షలు కేటాయించేలా పురందేశ్వరి ప్రత్యేక శ్రద్ధచూపారు. ప్రస్తుతం ప్లాంట్, యాంత్రీకరణ పనులు పూర్తయ్యాయి. దీని ద్వారా తాగునీటితో పాటు వాడుక నీటిని శుద్ధిచేసి గ్రామంలోని రక్షిత నీటి పథకం ద్వారా సరఫరా చేయనున్నారు. గ్రామంలోని సగంపైగా జనాభాకు ఈ నీరు అందనుంది.

గ్రామం మొత్తం దాహం తీర్చేలా.. : అదేవిధంగా కారంచేడు శివారు, మిగతా ప్రాంత ప్రజల తాగు, వాడుక నీటి ఇబ్బందులు తొలగించేందుకు గ్రామంలోని జేపీ చెరువు వద్ద మరో కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించనున్నారు. రూ.కోటి నిధులను అక్వాటిక ఫ్రోజెన్ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్ సమకూర్చేలా ఎంపీ పురందేశ్వరి కృషి చేశారు. ఈ పథకం పూర్తయితే గ్రామానికి మొత్తం శుద్ధజలాలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా ప్రతిరోజూ 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటిని శుద్ధి చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు వీటిని పురందేశ్వరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరై ప్రారంభించనున్నారు.


లోపల ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు

ఏటా 67 మిలియన్ టన్నుల ఆహారం వృథా



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త ఏడుకొండలు

బాపట్ల, న్యూస్‌టుడే: దేశంలో ఏటా 67 మిలియన్ టన్నుల ఆహారం వృథాగా పోతోందని కోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఏడుకొండలు అన్నారు. వ్యవసాయ కళాశాల కోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రంలో ఆహార వృథా, నష్టాల నివారణపై విద్యార్థులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రిమి కీటకాల వల్ల ఏటా 27 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నష్టం జరుగుతోందన్నారు. ఎన్జీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ 2030 నాటికి ఆహార వృథాను సగానికి తగ్గించటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వృథా, నష్టాన్ని అరికడితే 94 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు అదనంగా ఉత్పత్తి చేసినట్లు అవుతుందన్నారు. ఆహార వృథా, నష్టాన్ని అరికట్టటం ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకటన్నారు. శాస్త్రవేత్తలు సందీప్ రాజా, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 11న భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు


మాట్లాడుతున్న అమ్మడు, సభ్యులు

గుంటూరు, న్యూస్‌టుడే : తిరుపతి తిరుమల దేవస్థానం (తితిదే), హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో గీత జయంతి పురస్కరించుకొని డిసెంబర్ 11వ తేదీన భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు తితిదే, హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అమ్మడు తెలిపారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో గురువారం ఆమె వివరాలు తెలిపారు. భగవద్గీత 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగం (ధ్యాన) నుంచి పోటీలు ఉంటాయన్నారు. 6-7 తరగతులకు ఒక విభాగం, 8-9 తరగతులకు మరో విభాగంగా పోటీలు జరుగుతాయన్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థం చేసిన 18 సంవత్సరాలు లోపువారికి, 18 సంవత్సరాలు పైబడినవారికి రెండు విభాగాల వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు ఇస్తారుఉ. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9989023329 సంప్రదించాలన్నారు. సమావేశంలో సభ్యులు సుబ్బారావు, శివయ్య, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతులు సమకూరిస్తే చాలు... కల్తీ గుట్టు విప్పేస్తుంది!

ఈనాడు, అమరావతి

వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఉత్పత్తులతోపాటు ఆహార పదార్థాల నాణ్యత నిర్ధారించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మొదటి ప్రయోగశాల ఇది. పూర్తిస్థాయిలో అందుబాటులో కొస్తే ఆహార పదార్థాలు, పానీయాల నాణ్యతను పరీక్షించే వెసులుబాటు కలుగుతుంది. తద్వారా రైతులతోపాటు వ్యాపారులు, ఎగుమతి కంపెనీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని నేషనల్ అక్రిడిటేషన్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించారు.

వైకాపా పాలనలో చతికిలబడ్డ అనేక విభాగాల్లో గుంటూరులోని లాంఫామ్‌లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల నాణ్యత ప్రయోగశాల ఒకటి.. ఉద్యాన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో 2019 నాటికే రూ. 10 కోట్లతో భవనాల నిర్మాణం పూర్తయి.. అవసరమైన పరికరాలు సమకూరినా నాటి జగన్ ప్రభుత్వం నిధులివ్వలేదు. కనీసం నిర్వహణనూ పట్టించుకోలేదు. ఫలితం అది నామమాత్రపు పరీక్షలకే పరిమితమవ్వాల్సి వచ్చింది.


ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో లాంఫామ్‌లో నిర్మించిన ప్రయోగశాల భవనం

ప్రయోజనాలు ఎన్నెన్నో..

❖ అన్ని పదార్థాలు పరీక్షించి నాణ్యత ధ్రువపత్రాలిస్తారు. వీటి ఆధారంగా వ్యాపారులు వారి ఉత్పత్తులు విక్రయించుకోవచ్చు.

❖ పౌల్ట్రీ, డెయిరీ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బిస్కెట్లు, బేకరీ ఉత్పత్తులు, తేనె, చక్కెరతో తయారైన పదార్థాలు, అన్ని రకాల కేకులు, చాక్లెట్లు, మద్యం, శీతల పానీయాలు, చిరుధాన్యాల ఉత్పత్తులు, వేరుశనగ, వాల్‌నట్స్, పచ్చళ్లు, చట్నీలు, గోరుచిక్కుడు, మొక్కలతో తయారైన ఔషధాలు, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల నాణ్యత పరీక్షిస్తారు.

❖ పురుగుమందుల అవశేషాల్లేని ఆహార పదార్థాలను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

❖ చేపలు, రొయ్యలు, సముద్ర ఉత్పత్తుల నిల్వ, రవాణాలో హానికరమైన రసాయనాల వినియోగాన్ని తెలుసుకోవచ్చు.

❖ చిరుధాన్యాలలో ప్రొటీన్లు, ఫైబర్, ఇతర ఖనిజాల శాతం ఎంతన్నది నిర్ధారించవచ్చు.

❖ భూమిలో భార ఖనిజాలు, నైట్రేట్లు, నీటిలో బ్యాక్టీరియా, ఫ్లోరైడ్ తదితరాలను గుర్తించొచ్చు.

❖ ఆహార పదార్థాల నాణ్యతతోపాటు పురుగుమందుల రసాయనాల అవశేషాల శాతాన్ని కూడా లెక్కిస్తారు.

❖ ఆహార పదార్థాల్లో బూజు, యాంటీబయోటిక్స్, వెటర్నరీ డ్రగ్స్ అవశేషాలను క్షుణ్ణంగా పరీక్షించే పరికరాలు ఇక్కడున్నాయి.

రైతులకు ఉపయోగకరం

నాణ్యమైన ఆహార పదార్థాల ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రయోగశాల ఎంతగానో ఉపయోగపడుతుంది. కృష్ణా నుంచి మామిడికాయలు, గుంటూరు, కృష్ణా, అనంతపురం నుంచి కరివేపాకు పొడి, గుంటూరు నుంచి కారం పొడితోపాటు వివిధ ప్రాంతాల నుంచి తాజా కూరగాయలు, చేపలు, రొయ్యలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వీటిని ఇక్కడి ప్రయోగశాలలో పరీక్షించి, ధ్రువపత్రం పొందితే అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర పొందడానికి వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంటుంది.

ఆర్థిక కష్టాలు తీరితేనే....

ప్రయోగశాల ఏర్పాటుకు కేంద్రం ఆర్‌కేవీవై కింద నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వం కేంద్రానికి యూసీలు పంపకపోవడంతో నిధులాగిపోయాయి. ఉద్యానవర్సిటీ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది. నిధులు, నిర్వహణ సిబ్బంది లేక ఐదేళ్లుగా నామమాత్రపు పరీక్షలకే పరిమితమైంది. ఈ విషయమై ఉద్యాన పరిశోధన కేంద్రం విభాగాధిపతి గిరిధర్ మాట్లాడుతూ నిధులు, సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధుల విడుదలకు ప్రభుత్వం సుముఖం వ్యక్తం చేసిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల ఏర్పాటునకు అధిక ప్రాధాన్యం ఇస్తూ రుణాలు మంజూరు చేయాలని జేసీ ప్రఖర్ జైన్ అన్నారు. కలెక్టరేట్లో బ్యాంకర్లతో గురువారం నిర్వహించిన త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధికి ఎక్కువ రుణాలు ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత మండలాల్లో రుణాలు రీషెడ్యూల్ చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఆర్ఎస్ఈటీఐ సంస్థల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా లబ్ధిదారులను సమీకరించాలని సూచించారు. ఎల్డీఎం శివకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్లలో గవర్నర్ రెండు రోజుల పర్యటన

బాపట్ల, న్యూస్‌టుడే: రెండ్రోజుల వ్యక్తిగత పర్యటన నిమిత్తం గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం బాపట్ల వస్తున్నారు. మండల పరిధిలోని కొత్త ఓడరేవు వద్ద ఓ ప్రైవేటు రిసార్ట్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బస చేయనున్నారు. వ్యక్తిగత పర్యటన కావటంతో వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు.

దసరాకు కందిపప్పు

పంపిణీకి అధికారుల కసరత్తు



వేటపాలెం, న్యూస్‌టుడే

చౌకదుకాణాల ద్వారా దసరా పండక్కి కార్డుదారులకు కందిపప్పు పంపిణీకి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే కొన్ని రేషన్ షాపులకు వీటిని సరఫరా చేశారు. మిగిలిన వాటికి అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు ఇచ్చే కందిపప్పు, పంచదార ప్యాకెట్లలో తగ్గుదలను అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుర్తించింది. వెంటనే వీటిని సరిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పంపిణీ కాస్తా నిలిచిపోయింది. దీంతో గతనెలలో కార్డుదారులకు బియ్యంతో పాటు పంచదార మాత్రమే అందించారు. ఈనెల నుంచి కందిపప్పు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా సమాచారం

రేషన్ దుకాణాలు	1123
కార్డుదారుల సంఖ్య	4,86,000
బియ్యం కేటాయింపు	7,136 మెట్రిక్ టన్నులు
పంచదార	252 మెట్రిక్ టన్నులు
కందిపప్పు	150 మెట్రిక్ టన్నులు

బహిరంగ మార్కెట్‌లో రూ.160

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కిలో రూ.160 వరకు పలుకుతోంది. కార్డుదారుల్లో అధిక శాతం పేదలు. వీరు మార్కెట్‌లో ప్రత్యేకంగా దీన్ని కొనుగోలు చేసే శక్తి ఉండదు. ఏదన్నా పండగలు పబ్బాలకు మాత్రమే కొనుగోలు చేస్తారు. అదీ అవసరమైన మేరకే తీసుకుంటారు. ఫలితంగా వీరికి పోషకాహారం అందని స్థితి నెలకొంది. అదే రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67 అందిస్తోంది. దీంతో కార్డుదారులు ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేయడానికి ముందుకు వస్తారు. ఈనెల నుంచి వీటిని ఎండీయూ వాహనాల ద్వారా అందించనున్నారని తెలియడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాలకు కేటాయించాం

ఈనెల నుంచి కార్డుదారులకు కందిపప్పు అందజేస్తున్నాం. దీనికోసం 150 మెట్రిక్ టన్నులు కేటాయించాం. వీటిని కొన్ని దుకాణాలకు పంపించాం. మిగిలిన వాటికి రెండు మూడు రోజుల్లో అందజేస్తాం.

-ఈబీ విలియమ్స్, డీఎస్వో, బాపట్ల

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, గనుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జలవనరుల శాఖ, భూగర్భ నీటి, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టా భూముల్లో ఇసుక తవ్వకాల కోసం పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ పుస్తకం, గ్రామ మ్యాప్‌లోని భూమి ప్రదేశాన్ని కలిపి ఇసుక తవ్వకాలకు అనుమతి కోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) పట్టా భూమిని సంయుక్తంగా పరిశీలిస్తుందన్నారు. గనుల శాఖ అధికారులు భూముల్లో తవ్వాల్సిన ఇసుక పరిమాణంపై అంచనా వేసి నివేదిక ఇస్తుందని పేర్కొన్నారు. పట్టా భూముల నుంచి ఇసుక తవ్వకం ప్రతిపాదనలను డీఎల్ఎస్‌సీ పరిశీలించి ఆమోదం తెలుపుతుందన్నారు. నదీ గర్భం పరిధిలోని పట్టా భూముల్లో గనుల శాఖ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు జరుగుతాయని, భూమి యజమానికి టన్నుకు రూ.60లు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. నదీ గర్భం బయట ఉంటే పట్టా భూముల్లో తవ్విన ఇసుకను టన్నుకు రూ.250 లకు వినియోగదారులకు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఏపీ ఇసుక నిర్వహణ పోర్టల్‌లో ఇసుక తవ్వకం అనుమతుల వివరాలు లభ్యమవుతాయని ఆయన తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ.3 లక్షల సాయం

బాపట్ల, న్యూస్‌టుడే: క్యాన్సర్‌తో బాధపడుతున్న వేమూరు నియోజకవర్గానికి చెందిన పెరుగు సీతారావమ్మకు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవతో చికిత్స నిమిత్తం ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఆర్థిక సాయం చెక్కును బాధితురాలికి అందజేయనున్నట్లు ఎంపీ తెలిపారు.

ధూళిపూడి ప్రభుత్వ వైద్యశాల పరిశీలించిన కేంద్ర బృందం



కేంద్ర బృంద సభ్యులతో స్థానిక వైద్య సిబ్బంది

నగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ధూళిపూడి ప్రభుత్వ వైద్యశాలను నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) కేంద్ర బృంద సభ్యులు గురువారం పరిశీలించారు. వైద్యశాలలోని పరిసరాలు, వైద్య పరికరాలు, మందులు, ల్యాబొరేటరీలను బృంద సభ్యులు వైద్యులు ఈశ్వరి, సబీర్ పటేల్, ప్రశాంతి, కిషోర్ పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యశాలలోని అన్ని విభాగాలతో పాటు సిబ్బంది పనితీరును, వైద్యశాలలో ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రమాణాలు పర్యవేక్షించారు. అనంతరం వైద్యశాలలో పరిశుభ్రతను మరింత మెరుగు పరచుకోవాలని సిబ్బందికి సూచించారు.

సాంకేతిక లోపంతో 15 నిమిషాలు ఆలస్యంగా నడిచిన రైళ్లు

బాపట్ల పట్టణం: రైల్వే సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపంతో గురువారం సాయంత్రం పలు రైళ్లు బాపట్ల రైల్వే స్టేషన్‌లో సుమారు 15నిమిషాల పాటు నిలిపివేశారు. దీంతో విజయవాడ నుంచి చెన్నై, గుంటూరు వైపు నుంచి తిరుపతి వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడిచాయి. శబరి, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యంగా నడవటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చుండూరు-తెనాలి రైల్వే మార్గంలో రైల్వేట్రాక్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈసమస్యలు తలెత్తినట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.

భళా పూజిత

ఏడాదికి రూ.24 లక్షల వేతనంతో అమెరికన్ బ్యాంకులో ఉద్యోగానికి ఎంపిక



పూజితను సత్కరిస్తున్న కాకతీయ సేవా సమాఖ్య ప్రతినిధులు

బాపట్ల, న్యూస్‌టుడే: అమరావతి విట్ విశ్వవిద్యాలయంలో సీఎస్ఈ విభాగంలో విద్యార్థిని గొట్టిముక్కల పూజిత కళాశాల టాపర్‌గా నిలిచి ఏడాదికి రూ.24 లక్షల వేతనంతో అమెరికా బ్యాంకు వెల్స్‌ఫోర్గోలో ఉద్యోగానికి ఎంపిక కావటం అభినందనీయమని కాకతీయ సేవా సమాఖ్య గౌరవాధ్యక్షురాలు మానం విజేత అన్నారు. పట్టణంలోని కమ్మజన సేవా సమితిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాలెం మండలం గణపవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని గొట్టిముక్కల పూజితను కాకతీయ సేవా సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు ఆచంట రమేష్‌బాబు మాట్లాడుతూ సీఎస్ఈలో అత్యధిక మార్కులతో పసిడి పతకాలు సాధించటమే కాకుండా అమెరికన్ బ్యాంకులో ఆకర్షణీయమైన వేతనంతో ఉద్యోగానికి ఎంపికైన పూజిత విజయం ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. సేవా సమాఖ్య ఉపాధ్యక్షుడు జి.యజ్ఞ నారాయణ, ప్రధాన కార్యదర్శి పువ్వాడ దుర్గాప్రసాద్, కార్యదర్శి మద్దిన ప్రసన్నాంజనేయులు, కోశాధికారి గణేష్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో దశ నిర్మాణానికి సంబంధించి త్వరలో సీఆర్డీఏ అధికారులతో కూడా సమీక్షించి చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో జాతీయ రహదారులతో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ విషయంపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి సమీక్షించామని తెలిపారు. మూడో దశ పనులకు సంబంధించి సుమారు 300 మందికి పరిహారం విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో సీఆర్డీఏ అధికారులతో సమీక్షించి పరిహారం నిర్ణయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్ తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎన్‌హెచ్ఏఐ గుంటూరు, విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్లు పార్వతీశం, శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సభ్యుల ఎంపిక



మురుగుడు సత్యనారాయణ



గద్దే హేమసుదరరావు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రైలుపేట సొసైటీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికుల సంఘం సదస్సులో జిల్లా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గద్దే హేమసుందరరావు, జిల్లా కార్యదర్శిగా మురుగుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులను నియమించారు. చేనేత పరిశ్రమ రక్షణ కోసం కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు.

మద్యం దుకాణాలకు తొమ్మిది వరకు దరఖాస్తుకు అవకాశం

బాపట్ల న్యూస్‌టుడే: జిల్లాలో 117 మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం వ్యాపారులు ఈ నెల 9న సాయంత్రం ఐదు గంటల లోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు చేయడానికి అవకాశం ఉందని డీపీఈవో గంటా దేవదత్తు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ బాపట్ల, వేమూరు, రేపల్లె, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వద్ద దరఖాస్తులు అందజేసేవారికి సాయం చేయటానికి నలుగురు డిజిటల్ సహాయకులు, బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 11న ఉదయం 11 గంటకు కలెక్టర్ వెంకట మురళి సమక్షంలో వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.

వరద బాధితుల రుణాలు రద్దు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

కొల్లూరు, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల సంభవించిన కృష్ణానది వరదల వల్ల నష్టపోయిన వారి రుణాలు రద్దు చేసి, ఆదుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని లంక గ్రామాలకు చెందిన వరద బాధితులతో నాలుగు ప్రజాసంఘాలు నిర్వహించిన 'సామూహిక రాయబారం' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. వరదల వల్ల కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని 20 లంక గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. దీని వల్ల ముంపు గ్రామాల్లో నివాసాలు, గృహోపకరణాలు, వాహనాలు కొట్టుకు పోవడం, మిగిలి ఉన్నవి పనికి రాకుండా పోవడం వల్ల బాధితులు కట్టుబట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు మొత్తం తుడిచి పెట్టుకు పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. బాధితులు జాబితాల తయారీలో అవకతవకల వల్ల నష్టపోయిన వారిలో కొందరికి పరిహారం సైతం అందలేదని చెప్పారు. పరిహారం దక్కని వారిని గుర్తించి వారికి న్యాయం చేయాలని అధికారులను కోరారు. ముంపు ప్రభావిత లంక గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు, రైతులు, కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని, పెట్టుబడి ఆధారంగా పంట నష్టపరిహారాన్ని పెంచాలని, డ్వాక్రా మహిళలకు ఖాతాల్లో జమైన పరిహారం సొమ్మును బాధితుల బాకీలో జమ చేయకుండా వారికి అందించాలని తహసీల్దారు వెంకటేశ్వర్లుకు ఆమె వినతిపత్రం అందజేశారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో గంజాయి అమ్మకాలపై పోలీసులు దృష్టి సారించారు. శివారు కాలనీల్లో కొందరు నేరుగా ఇళ్ల వద్దనే అమ్మకాలు సాగిస్తున్నట్లు చుట్టుపక్కల వారు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ విద్యాలయాల వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు యాజమాన్యాలు గుర్తించాయి. గంజాయి తాగి విద్యార్థులు నేరుగా తరగతులకు హాజరవుతున్నట్లు గుర్తిస్తున్నప్పటికీ వారిని దండించే పరిస్థితి లేకపోవటం విశేషం. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో గంజాయి విక్రేతల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయాన్ని కొందరు పోలీసులు నర్మగర్భంగా అంగీకరిస్తుండటం విశేషం.

చేనేత పరిశ్రమను రక్షించుకోవాలి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: చేనేత పరిశ్రమను రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక రైలుపేట సొసైటీలో గురువారం చేనేత శాశ్వత రక్షణ సదస్సు గురువారం మురుగుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ సంక్షోభంలో పడటంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు.

ఇసుక కొరత లేకుండా చూడాలని డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్

బాపట్ల, న్యూస్‌టుడే: ఇసుక కొరత వల్ల జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. ఇసుక కొరత పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రథం బజారులో గురువారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాపట్లలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.7200లుగా ఉందన్నారు. దీని వల్ల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు.

వరద నీరు వెళ్లడంలేదు.. పరిహారం చెల్లించలేదు



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు, రైతులు

కారంచేడు, పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: దశాబ్దాల కాలం నుంచి పంట పొలాల్లోని వరద నీరు ప్రవహించేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను హైవే విస్తరణలో భాగంగా లేకుండా చేస్తున్నారని, సకాలంలో అందాల్సిన విస్తరణ పరిహారం ఇప్పటికీ చెల్లించలేదంటూ పర్చూరు, కారంచేడు మండలాల రైతులు జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఎదుట వాపోయారు. వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పర్చూరు కారంచేడు మండలాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పొలాల్లో రోజుల తరబడి వాన వెళ్లక సాగు కష్టసాధ్యమైందని ఆరోపించారు. ఈవిషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి రైతులు తీసుకెళ్లగా స్పందించిన ఆమె కలెక్టర్ వెంకట మురళికి సమస్య పరిష్కరించాలని కోరారన్నారు. స్పందించిన ఆయన జేసీని పంపగా గురువారం రాత్రి ఆయా ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన భూములను పరిశీలించారు. సంబంధిత అధికారులు, గుత్తేదారుకు వెంటనే వరదనీరు పారుదలకు అవసరమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, రైతులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్డీవో గ్లోరియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మా... అమ్మమ్మ ఇంటికి వెళతా..

☛ అవే ఆ యువతి చివరి మాటలు.. ☛ పిడుగుపాటుకు దుర్మరణం



తులసి (పాత చిత్రం)



కుమార్తె మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి పార్వతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: అమ్మా.. దసరా సెలవులిచ్చారు కదా.. . అమ్మమ్మ దగ్గరకు వెళతాను... అని కుమార్తె అడగడంతో ఆ తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం పంపించారు... ఇంకా ఆ మాటలు ఆ భార్యాభర్తలు చెప్పుకొంటూనే ఉన్నారు.... ఇంతలో పిడుగు రూపంలో ఆ యువతిని మృత్యువు కబళించింది... విషయం తెలియడంతో వారు వచ్చి విగతజీవిగా పడి ఉన్న కూతురు మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంట తడిపెట్టించింది... ఈ హృదయ విదారక ఘటన చీరాల ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. బాపట్ల మండలం నరాలశెట్టిపాలేనికి చెందిన నూతక్కి వెంకటేశ్వర్లు పార్వతి దంపతులకు తులసి(19) ఒక్కగానొక్క కుమార్తె. వెంకటేశ్వర్లు కారు డ్రైవరుగా పనిచేస్తారు. తులసిని అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. చదువులోనూ చురుకైన విద్యార్థి. స్థానికంగా బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో చేరింది. మొదటి సంవత్సరం చివరి సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. ఈలోపు దసరా సెలవులు వచ్చాయి. అమ్మమ్మ ఊరైన చీరాల మండలం పాతచీరాలకు వచ్చింది. తులసి ఉదయం అల్పాహారం తీసుకుంటూ ఒక్కసారి మేడమీదకు వెళ్లింది. అప్పుడు వర్షంతో పాటు పెద్ద పెద్ద శబ్దంతో ఉరుములు, మెరుపులు మెరిశాయి. ఈ దాటికి ఆమె పక్కన పిడుగు పడడంతో ఆ షాక్‌కు కుప్పకూలిపోయింది. పిడుగు పాటుకు కొంతమేర శ్లాబుకు రంధ్రం పడింది. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు భవనం పైకి వెళ్లి చూడగా తులసి ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. ఈ సమాచారం అందుకున్న మృతురాలి తల్లిదండ్రులు చేరుకుని సెలవులకని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఇప్పుడు ఇలా మమ్మల్ని ఒంటరివాళ్లను చేసి వెళ్లిపోయావా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

పింఛను నగదుతో సచివాలయ ఉద్యోగి పరారీ

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: పింఛను నగదు పంపిణీ చేయకుండా సచివాలయ ఉద్యోగి పరారైన మండల పరిధిలోని అడవి-2 పంచాయతీలో చోటుచేసుకుంది. పంచాయతీ పరిధిలోని 58 మంది లబ్ధిదారులకు ఈనెల 1వ తేదినే పింఛను పంపిణీ చేయాలంటూ పంచాయతీ అధికారులు గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేసే కొత్త ఓడరేవుకు చెందిన మున్నం వెంకట బాబురెడ్డికి గతనెల 30న రూ.2.14లక్షల నగదు అందచేశారు. అయితే ఆ ఉద్యోగి 58మంది లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయాల్సి ఉండగా 18 మందికి మాత్రమే పంపిణీ చేశాడు. మిగిలిన 40లబ్ధిదారులకు రూ.1.73లక్షల నగదు పంపిణీ చేయకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు సమాచారం. దీనిపై అడవి-2 గ్రామ పంచాయతీ కార్యదర్శి బత్తుల రాజశేఖర్ ఉద్యోగి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవటంతో గురువారం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామీణ సీఐ కె.గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వేటపాలెం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామన్నపేటలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన గంటా శేఖర్ (35) వాణి దంపతులు. వీరికి పిల్లలు లేకపోవడంతో ఒక బాబును పెంచుకుంటున్నారు. ఇద్దరి తరచూ గొడవలు పడుతుంటారు. ఈనేపథ్యంలో ఉదయం పదిగంటల సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. వెంటనే శేఖర్ నేను నిద్రపోవాలని చెప్పి ఇంటిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. గంట తరువాత చూడడంతో అతడు ఉరేసుకుని మృతిచెందాడు. విషయం తెలియడంతో చీరాల గ్రామీణ సీఐ ఎం.శేషగిరిరావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ, ఒకరికి తీవ్ర గాయాలు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: నామ్ రహదారిపై శింగరకొండ 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగిన ప్రమాదంలో జే పంగులూరు మండలం బూదవాడకు చెందిన చెంచుబాబుకు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. శింగరకొండ వైపు నుంచి పట్టణంలోకి ద్విచక్ర వాహనంపై వస్తున్న చెంచుబాబును అదే రహదారిలో ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. యువకుడి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

బాపట్ల
• బాపట్ల • రేపల్లె • వేమూరు

భూ సార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలి

వేమూరు,న్యూస్‌టుడే: వరి సాగు చేసిన రైతులు భూ సార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారిణి సునీత తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

రేపల్లె పురపాలిక డీఈ బాధ్యతల స్వీకరణ


మధుసూదనరావు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పురపాలిక సంఘం నూతన డీఈగా ఓలేటి మధుసూదనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధరణ బదిలీల్లో భాగంగా ఆయన పల్నాడు జిల్లా మాచర్ల నుంచి ఇక్కడికి వచ్చారు. నూతన డీఈకు సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

సహాయక ఆచార్యురాలు బదిలీ


విమలను సత్కరిస్తున్న ఏడీ బేగ్, సహచర ఆచార్యులు

బాపట్ల, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో పదేళ్లు ఆచార్యురాలిగా పని చేస్తూ విమల అందించిన సేవలు ప్రశంసనీయమని కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్ అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సహాయక ఆచార్యురాలు విమల అనకాపల్లి కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రానికి శాస్త్రవేత్తగా బదిలీ అయిన సందర్భంగా ఆమెను ఏడీ, ఆచార్యులు సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? జంపనిలో ఆరు, ఏడు వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు రాత్రిపూట రోడ్లపై నడవడానికి అవస్థలు పడుతున్నారు. **- స్థానికుడు, జంపని**

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- శేఖర్, ఈవోపీఆర్‌డీ. –న్యూస్‌టుడే, వేమూరు

? నిజాంపట్నం మండలం అడవులదీవి రేపల్లె ప్రధాన రహదారి వెంబడి ముళ్ల మొక్కలు పెరిగి ప్రయాణం ఇబ్బందిగా మారింది. రాత్రులు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెరిగిన ముళ్ల మొక్కలు తొలగించి సమస్య పరిష్కరించాలి. **- స్థానికుడు అడవులదీవి.**

✔ సమస్య మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- విద్యాసాగర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, నిజాంపట్నం.** –న్యూస్‌టుడే, నిజాంపట్నం

? రేపల్లె 21 వార్డు నిమ్మగడ్డవారి వీధిలో 20 రోజుల నుంచి విద్యుత్తు వీధి దీపం వెలగడంలేదు. రాత్రి వేళ రాకపోకలు చేసేందుకు ఇక్కట్లు పడుతున్నాం.
- నిమ్మగడ్డ కిశోర్, స్థానికుడు.

✔ తక్షణం విద్యుత్తు దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-రోహిణి, ఏఈ, రేపల్లె మున్సిపాలిటీ**
–న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

మము దీవించమ్మా.. కనకదుర్గమ్మా

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయాలు ఉదయం నుంచే భక్తులతో సందడిగా మారాయి. -న్యూస్‌టుడే బృందం


బతుకమ్మ ఊరేగింపులో ఆర్యవైశ్య మహిళలు


ప్రసన్న దుర్గా భవానీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు


పేటేరు: త్రిపురసుందరీ దేవిగా.


చెరుకుపల్లిల్లో..


చుండూరు మండలం యడ్లపల్లిలో..


నడింపల్లిలో..


భట్టిప్రోలులో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం


కోన కళాక్షేత్రంలో..


భట్టిప్రోలులో..


పోలేరమ్మ ఆలయంలో..


పాపిరెడ్డిపాలెంలో..


బాపట్ల మూడోవార్డు మండపంలో..


అమృతలూరు: గోవాడ శైవక్షేత్రంలో..


బాలాత్రిపురసుందరి దేవిగా


బ్రాహ్మణ సమాఖ్య మండపంలో..


శంకర విద్యాలయంలో గాయత్రీదేవిగా..


నగరం కొలగానివారిపాలెంలో..


రాజోలు శివాలయంలో..


కావూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో..


ఖాజీపాలెంలో..


చందోలులో..


నిజాంపట్నంలో పూజలు చేస్తున్న తెదేపా నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

చెరుకుపల్లి న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆలోచనలు కేంద్రం విరమించుకోవాలని రాష్ట్ర రైతుకూలీ సంఘ కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ఏఐఎఫ్‌టీయూ (న్యూ), ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం గురువారం చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ బాపట్ల జిల్లా నాయకుడు మరివాడ వెంకట్రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తుందని.. ప్రజలందరూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చెరుకుపల్లి విద్యార్థిని

చెరుకుపల్లి న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బుధవారం కారంపూడి బొల్లా బ్రహ్మనాయుడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని తమ్మా ఉమా హర్షిత ప్రతిభ కనబరిచి అండర్ -14 బాలికల ఖోఖో జట్టుకు ఎంపికైంది. ఈనెల 5న జే పంగులూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ బాలిక పాల్గొననుంది.

నేత్రదానం


బాబురావు (పాతచిత్రం)

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మండలంలోని నల్లూరిపాలేనికి చెందిన కూచిపూడి బాబురావు (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన కళ్లను భార్య సుజాత, కుమారుడు మహేష్, కుమార్తె సుచిత్ర కుటుంబ సభ్యులు దానం చేశారు. నాగాయలంకకు చెందిన సుధర్మ మానవతా సేవా సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ ద్వారా విజయవాడ ఎల్‌వీ.ప్రసాద్ కంటి వైద్యశాలకు మరణానంతరం వారి తమ తండ్రి రెండు కళ్లను దానం చేశారు. కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలంటూ వినతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: సాంఘిక శాస్త్రంలోని సిలబస్ తగ్గించాలంటూ ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం తరఫున గురువారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణిలో పి. గన్నవరం ఎమ్మెల్యే వి.సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మారిన పదో తరగతి సాంఘిక శాస్త్రం సిలబస్‌లో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉన్నాయని మార్చాలని ఆయన కోరారు.

బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు వీడ్కోలు


సత్కారం అందుకున్న ఉద్యోగులు

కొల్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, బదిలీపై వెళుతున్న దానయ్య, విజయ్, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, మహేష్, హరిత, కరిముల్లా, జస్మాయిల్, సోమయాజులు, రవిబాబులకు సహ ఉద్యోగులు గురువారం వీడ్కోలు పలికారు. జడ్పీటీసీ సభ్యుడు బొప్పన సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం టెండర్ల స్వీకరణ ఏర్పాట్ల పరిశీలన


దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను పరిశీలిస్తున్న సహాయ కమిషనర్ విజయ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పట్టణంలోని అబ్కారీ శాఖ కార్యాలయాన్ని ఒంగోలు అబ్కారీ శాఖ సహయ కమిషనర్ విజయ గురువారం పరిశీలించారు. కార్యలయం వద్ద మద్యం టెండర్ల కోసం ప్రస్తుతం ఇంకా దరఖాస్తులు నమోదు కాలేదని, పండగ సీజన్ కావడంతో మంచి సమయం చూసుకుని వచ్చే అవకాశం ఉందని, ఎక్కువ మంది వచ్చినప్పుడు దరఖాస్తు దారులు నిరీక్షించకుండా తగు సిబ్బంది వేగంగా, ఖచితత్వంతో పనిచేయాలని ఆమె సూచించారు.

నగరం: నగరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌ను అసిస్టెంట్ కమిషనర్ విజయ, ఏఈఎస్ జనర్ధనరావు పర్యవేక్షించారు. నిజాంపట్నం నుంచి మూడు దరఖాస్తులు వచ్చినట్లు సీఐ రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా తయారీ


మాట్లాడుతున్న ఎఫ్ఏసీ ఇన్‌ఛార్జి ఆర్డీవో లక్ష్మీకుమారి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా ప్రత్యేక దృష్టి సారించామని రేపల్లె ఎఫ్ఏసీ ఇన్‌ఛార్జి ఆర్డీవో లక్ష్మీకుమారి అన్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా రాజకీయపార్టీ నేతలు, అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన పౌరులకు ఓటుహక్కు కల్పిస్తున్నామన్నారు. నిబంధనల మేరకు మార్పులు, చేర్పులు తొలగింపులు చేస్తున్నారన్నారు. రేపల్లె మండలం చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక గ్రామాల ఓటర్లకు ఒకేచోట పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. చెన్నుపల్లివారిపాలెం నుంచి కిలోమీటరుకుపైగా ఓటర్లు నడిచి రావాల్సి వస్తోందని ఏ గ్రామానికి ఆగ్రామంలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెదేపా నాయకుడు జీవి నాగేశ్వరరావు కోరారు. రాజకీయపార్టీ ప్రతినిధులు సాయివరప్రసాద్, కిశోర్, కమిషనర్ సాంబశివరావు, తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న కంటివైద్య శిబిరం

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కనగాల ఇంజినీరింగ్ కళాశాల వద్ద 5న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాజీ మహ్మమద్ ఖాసీమ్ సాహెబ్, మహమ్మద్ గాలబ్ సాహెబ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ సమ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షేక్ హసన్ అహ్మద్, హాజీ షేర్ మహమ్మద్ అల్లాఉద్దీన్ స్మారకంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

అమృతలూరు: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ నాంచారయ్య తెలిపారు. కూచిపూడి- పోతుమర్రు మార్గంలోని విద్యుత్తు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3-00గం. వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.

8 నెలలు.. 20 ప్రమాదాలు

భయపెడుతున్న 'ఢీ'ఎంపల్లి కూడలి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో డీఎంపల్లి వద్ద 216ఏ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. డీఎంపల్లి లోపలి నుంచి వచ్చే వాహనాలు ప్రధాన రహదారిపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం ఎదురు నుంచి పట్టణంలోకి వెళ్లేందుకు కుడివైపునకు తిరిగే క్రమంలో చీరాల వైపు నుంచి వస్తున్న వాహనాలు వెనుక నుంచి ఢీకొంటున్నాయి. అదే సమయంలో జగన్నాథపురం వైపు నుంచి వచ్చే పాదచారులు, వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. గత ఎనిమిది నెలల్లో 20కు పైగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయిదీ ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా 26 మంది గాయపడ్డారు. డీఎంపల్లి నుంచి జాతీయ రహదారిపైకి వాహనాలు వచ్చే ప్రాంతంలో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేసి వాహనాలు వేగాన్ని తగ్గించి వెళ్లేలా చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలను నివారించగలుగుతారు. ఈ విషయమై మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావును సంప్రదించగా జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతంలో ఎన్‌హెచ్ 216ఏపై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


జాతీయ రహదారిపై డీఎంపల్లి వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం

తూము పగిలె.. కష్టాలు మిగిలె!

వేమూరు, న్యూస్‌టుడే: తెనాలి-వెల్లటూరు ఆర్‌అండ్‌బీ అడ్డరోడ్డు నుంచి జంపని మీదుగా మూల్పూరు వెళ్లే మార్గంలో మురుగునీటి ప్రవాహం కోసం రోడ్డు కింద వేసిన తూము కుంగి పగిలిపోయింది. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడింది. కొన్ని నెలల నుంచి పరిస్థితి ఇలా ఉన్నా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. నిత్యం ఈ మార్గంలో వివిధ పనిపాటలకు వెళ్లే వారితో పాటు పదుల సంఖ్యలో స్కూల్, కళాశాల వాహనాలు తిరుగుతుంటాయి. రహదారి కుంగడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అంతేకాదు రాత్రిళ్లు ఈ రోడ్డున నడిచివెళ్లే వారు సైతం తూము పగిలిన చోట గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవతీసుకుని పగిలిన కల్వర్టును తొలగించి, దాని స్థానంలో కొత్త కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ శేఖర్‌ను సంప్రదించగా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని సమాధానం ఇచ్చారు.


జంపని ప్రధాన కూడలిలో పగిలిన కల్వర్టు తూము

రోడ్డు ముక్కలైంది!

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి పరిచాక వాటికి రెండు వైపులా బరమ్స్ ఏర్పాటు చేయడం లేదు. దీంతో చాలా చోట్ల రోడ్లు కోతకు గురై పాడవుతున్నాయి. మండలంలో నడింపల్లి యాదవబజార్ నుంచి ముస్లిం బజారుకు వేసిన సీసీ రహదారి ఇటీవల విరిగింది. రోడ్డుకు ఒక పక్క కాల్వ ఉంటే మరో వైపు చిన్నపాటి మట్టి కాల్వలను ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డు కింద తూము ఉంది. దీంతో తూములోకి మురుగునీరు వెళ్లేది. ఇటీవల భారీ వర్షాలు కురిసిన సమయంలో నీరు వేగంగా ప్రవహించడంతో రోడ్డు కింద మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనల రాకపోకలతో రోడ్డు కింద బరువు లేక సీసీ రహదారి కొంత మేర విరిగి ముక్కలైంది. దీంతో రోడ్డు కుంచించుకపోయి పెద్ద వాహనాలు, పాఠశాల బస్సులు తిరిగే వీలులేకపోయింది. అధికారుల నిర్లక్ష్యం రూ.లక్షల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు కాలపరిమితి పూర్తికాకుండానే నిరుపయోగంగా మారడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నడింపల్లిలో దెబ్బతిన్న సీసీ రహదారి

అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం


యేమినేనివారిపాలెంలో కాలిపోయిన ఇల్లు

ఆరుంబాక (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని ఆరుంబాక పంచాయతీ పరిధి, యేమినేనివారిపాలెం కాలనీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన వారె ఈరమ్మ దసరా కావడంతో గురువారం ఉదయం తన రేకులు, తాటిఆకుతో కూడిన ఇంటిలో దీపారదన చేసి బయట పనులు చేసుకుంటోంది. మంటలు తాటాకులకు అంటుకోవడంతో ఇంటిలోని వస్తువులు కాలిపోయాయి. ఘటనను అధికారులు పరిశీలించి రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. నిలువు నీడ లూకుండా పోయిందని బాధిత కుటుంబం బోరున విలపించారు. చెరుకుపల్లి పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు.

కొల్లూరు: పొయ్యిలోని మంటలు ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా ఎగసి పడడంతో గురువారం స్థానిక జగ్జీవన్‌రాం విగ్రహం పక్కను ఉన్న దోనేపూడి సరోజినికి చెందిన పలహారశాల కాలి బూడిదైయింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని సరకులు, టీవీ ఇతర సామాన్లు పూర్తిగా కాలిపోవడంతో సుమారు లక్షన్నర రూపాయలు నష్టం సంభవించిందని బాధితురాలు వాపోయింది.

పేరేమో ఘనం.. పనులేమో శూన్యం

నిజాంపట్నం మేజరు పంచాయతీలో మౌలిక వసతులు కరవు


నిజాంపట్నం పల్లెపాలెం రేవు అంచున దుస్థితి ఇది


పూడిక తీతకు నోచుకోని మొగదారమ్మ గుడి రోడ్డులోని మురుగు కాల్వ

నిజాంపట్నం, న్యూస్‌టుడే

అది పేరుకే మేజరు పంచాయతీ. కానీ మౌలిక వసతుల కల్పనలో మాత్రం వెనకబడే ఉంది. సుమారు 25 వేల పైన జనాభా ఉన్న నిజాంపట్నం పంచాయతీలో రోడ్లపై ఎక్కడ చూసినా చెత్త, డ్రైనేజీల్లో పారని మురుగు దర్శనమిస్తాయి. పాలకులు మారుతున్నారు తప్ప మౌలిక వసతులు సమకూర్చడంపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అతి పెద్ద మేజరు పంచాయతీల్లో ఇది ఒకటి. నగర పంచాయతీ ప్రతిపాదన ఉన్నా నాయకుల చొరవ చూపక పోవడంతో ప్రతిపాదన దశ నుంచి ముందుకు కదలలేదు. 18 వార్డులున్న పంచాయతీలో ఇంకా మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా ఆయా వీధులు జలమయం కావడంతో పాటు ప్రధాన రహదారులు సైతం చెరువులుగా మారుతున్నాయి.

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

నిజాంపట్నంలో ఏ వీధి చూసినా చెత్త, చెదారం దర్శనం ఇవ్వాల్సిందే. ముఖ్యంగా నిత్యం ప్రధాన బజారుతో పాటు కొన్ని వీధులను సిబ్బంది శుభ్రం చేస్తారు. మిగిలిన వాటిని పట్టించుకోరని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాత సొసైటీ భవనం సమీపంలో, దర్వేష్‌పాలెం వెళ్లే మార్గంలో, పాలరేవు మార్గంలో, ఎస్‌బీఐకి వెళ్లే దారిలో మూడు రహదారులు కలిసిన చోట, రేవు అంచున డొంక మార్గంలో నిత్యం చెత్త దర్శనం ఇస్తోంది. ఆయా మార్గాల్లో నడిచే పాదచారులకు దుర్వాసన వెదజల్లి సౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ప్రజల అవసరాలు తీర్చే మండల పరిషత్తు కార్యాలయ ఆవరణ పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తాయి. దీంతో సేవలు వినియోగించడానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఇక్కడి పంచాయతీ కార్యదర్శికి మరో ఐదు పంచాయతీల బాధ్యతలు కేటాయించడంతో ఆయన అన్ని పంచాయతీలు సమన్వయం చేయడం కష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నిజాంపట్నం మేజరు పంచాయతీలో పక్కాగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు చేస్తాం

పంచాయతీలో పక్కాగా పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రణాళిక ప్రకారం ప్రతి రోజు వీధులు శుభ్రం చేయించేలా చర్యలు చేపడతాం. –ఏ ప్రసాద్ ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, నిజాంపట్నం.

అన్న క్యాంటీన్‌కు రూ.50 వేల విరాళం

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లెలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో తెదేపా నేత శివప్రసాద్‌కు గురువారం అన్న క్యాంటీన్ నిర్వహణకు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దాసరి కృష్ణకుమారి జ్ఞాపకార్థం మనవరాలు, మనవడు దేవినేని గీతాస్వర్ణ, దేవినేని హర్షవర్ధన్ రూ.50 వేలు విరాళం అందజేశారు.

మాదక ద్రవ్యాలపై నివారణపై అవగాహన సదస్సు

నగరం, న్యూస్‌టుడే: వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మాదక ద్రావ్యాలు నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రేపల్లె సీఐ సురేష్‌బాబు, నగరం ఎస్సై భార్గవ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుపై ఏకాగ్రత చూపాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి, ప్రిన్సిపల్ హరికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ విష సంస్కృతికి దూరంగా ఉండండి



మాట్లాడుతున్న పట్టణ సీఐ అహ్మద్ జానీ

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు ర్యాగింగ్ విష సంస్కృతికి దూరంగా ఉండాలని పట్టణ సీఐ అహ్మద్ జానీ అన్నారు. ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో జూనియర్లను వేధిస్తే కేసులు నమోదై జైలుకు వెళ్తారని హెచ్చరించారు. భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. కళాశాల ఏడీ స్మిత్, న్యాయవాది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



? బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు మాగాణి పొలాల్లో రెండు రోజుల క్రితం విద్యుత్తు తీగ తెగి పడింది. దీంతో పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. తక్షణం మరమ్మతులు చేయించాలి.
- పవన్‌కుమార్, వి.కొప్పెరపాడు

✔ శుక్రవారం ఉదయం సమస్య పరిష్కరిస్తాం. ఇప్పటికే ప్రమాదం జరగకుండా సరఫరా నిలుపుదల చేశాం.
- శ్రీనివాస్, విద్యుత్తు ఏఈ, బల్లికురవ.

వి.కొప్పెరపాడు(అద్దంకి), న్యూస్‌టుడే

చీరాల పరిధిలో 24 మద్యం దుకాణాలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల ఆబ్కారీ స్టేషన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల్లో 24 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు సీఐ పి.నాగేశ్వరరావు తెలిపారు. వీటిల్లో చీరాల పట్టణం-8, చీరాల మండలం-6, వేటపాలెం-5, కారంచేడు-2, చినగంజాం-3 షాపులు ఉన్నాయన్నారు. ఇవి కాక మరో రెండు దుకాణాలు గౌడ సామాజికవర్గానికి కేటాయించారని, వాటి వివరాలు ఇంకా రాలేదన్నారు. కారంచేడు, చినగంజాం దుకాణాలకు రూ.55 లక్షలు, చీరాల, వేటపాలెం పరిధిలో రూ.65 లక్షలుగా ప్రభుత్వ ఫీజు నిర్ణయించిందన్నారు. గురువారం వరకు ఒక్క దుకాణానికి ఎవరూ దరఖాస్తులు దాఖలు చేయలేదన్నారు. ఇప్పుడిప్పుడే వచ్చి వివరాలు తెలుసుకుంటున్నట్లు సీఐ చెప్పారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

6న నేత్ర వైద్య శిబిరం


మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇసుకదర్శి క్యాంప్ కార్యాలయంలో ఈనెల 6న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏలూరి క్యాంప్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో కంటి సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

బస్ పాసులకు అంతరాయం

చీరాల, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ కారణంగా ఆర్టీసీ బస్ పాసులు ఈనెల 5,6 తేదీల్లో ఇవ్వటాన్ని నిలిపివేస్తున్నట్లు డీఎం శ్యామల తెలిపారు. 7వ తేదీ నుంచి తిరిగి అన్ని రకాల బస్సు పాసులు కౌంటర్లలో ఇస్తారని చెప్పారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



పర్చూరు: అమ్మవారికి విశేష పూజలు



అద్దంకి అనఘాలక్ష్మి.. బాలాత్రిపుర సుందరి దేవిగా..



మార్టూరులో దుర్గామాతగా



పూసూరు: ప్రత్యేక అలంకరణలో పంచముఖ గాయత్రీదేవి



జే పంగులూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో..

వైభవోపేతం... నవరాత్రి మహోత్సవం

దసరా పూజలు ఆరంభం

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, జే.పంగులూరు, బల్లికురవ(అద్దంకి), పర్చూరు, కారంచేడు (మార్టూరు), మార్టూరు, యద్దనపూడి, మేదరమెట్ల, ఇంకొల్లు, చినగంజాం, న్యూస్‌టుడే: చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో గురువారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలా త్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చారు. చీరాల సంతబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో 1116 మంది మహిళలతో జలబిందెలు ఊరేగింపు తీసుకెళ్లి, అమ్మవారికి అభిషేకం చేశారు. వేటపాలెం కన్యకాపరమేశ్వరి ఆలయంలో అఖండ దీపారాధనతో కార్యక్రమాలు ఆరంభించారు. రాజ్యలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అద్దంకి శ్రీలక్ష్మీ సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం ఐదు గంటలకే 240మంది మహిళలు కలశాలతో గుండ్లకమ్మ నదికి వెళ్లి జలాలు తెచ్చి, అమ్మవారికి అభిషేకం చేశారు. వింధ్యావాసిని సమేత నగరేశ్వర స్వామి, ధన్వంతరి దత్తపాదుకాక్షేత్రం, జలదుర్గా సమేత కమలేశ్వరస్వామి ఆలయాల్లో, జే పంగులూరు భీమలింగేశ్వరస్వామి, బల్లికురవ మండలం చెన్నుపల్లి వరసిద్ధివినాయక ఆలయంలోనూ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మేదరమెట్ల మిద్దెలడొంక సమీపంలోని శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇంకొల్లు చెన్నకేశవ స్వామి, భీమలింగేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయాల్లో ఉత్సవ విగ్రహాలను ప్రదర్శనలు చేయించారు. పద్మాల అంకమ్మ, కృష్ణమందిరం, సాయి మందిరాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో దుర్గామాతకు కన్యకాపరమేశ్వరి అలంకరణచేశారు. చినగంజాం మండలం సోపిరాల శివాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.



ద్రోణాదులలో..



సోపిరాలలో..



ఇంకొల్లులో..




వేటపాలెంలో అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపు



అద్దంకి: అమ్మవారి చిత్రపటం, కలశాలతో...

శివారు భూములకు సాగు నీరు

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చినగంజాం ప్రాంతంలోని చివరి భూములకు సైతం సాగు నీరు అందిస్తానని శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు అన్నారు. చినగంజాం మండలంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. తొలుత జాతీయ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెదేపా సీనియర్ నాయకుడు వడ్లమూడి వెంకయ్య పెద్దకర్మలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కోడూరివారి పాలెనికి చెందిన వీరభద్రయ్య, కొండూరి అంజనేయులు కుటుంబాలను పరామర్శించారు. సుమారు నెల రోజుల క్రితం వేటకు వెళ్లి సముద్రంలో వేర్వేరుగా మృతిచెందిన కోడూరివారిపాలేనికి చెందిన కొండూరి కోటయ్య, కాటంవారిపాలేనికి చెందిన వాయిల బుజ్జి కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. వారికి సంబంధించిన రెవెన్యూ పరమైన దస్త్రాలు వెంటనే ఇవ్వాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎస్.ప్రమీల, ఎస్సై ఎస్.రమేష్‌లకు సూచించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు పొద వీరయ్య, సర్పంచి నక్కల కృష్ణ, నాయకులు కె.వెంకట్రావు, యల్లావుల తిరుపతిరావు, నక్కల నారాయణ, అజాద్, ఆసోది బ్రహ్మానందరెడ్డి, కొండ్రగుంట శ్రీహరిరావు, బాబులు పాల్గొన్నారు.



ప్రజలు చెబుతున్న సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశానికి హాజరైన అధికారులు, డాక్టర్లు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అటువంటి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి అన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడే వైద్యులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం జరిగిన సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేటివ్ అథారిటీ, అడ్వైజరీ సమావేశంలో ఆయన మాట్లాడారు: ఆడ మగ అనే భేదం లేకుండా సమానంగా చూడాలని ప్రతి సమావేశంలో పీసీ అండ్ పీఎన్డీటీ మీద సభ్యులకు కనీసం పది నిమిషాలు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ ప్రోగ్రాం అధికారి డీఐవో డాక్టరు వెంకటేశ్వర్లు, డాక్టరు వై.యాకోబు, గైనకాలజిస్ట్ షణ్ముఖశ్రీ, ఒకటో పట్టణ సీఐ మారీడు శ్రీనివాసరావు, రాజా సాల్మన్, సుహాసిని, మరియమ్మ, అరుణ ఉన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవ పూజలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పురాతన శ్రీభూసమేత భావనారాయణస్వామి 17వ వార్షికోత్సవ తొలిరోజు పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. దేవేరులకు తిరుమంజన అభిషేకం నిర్వహించారు. అర్చకులు లక్ష్మీనరసింహాచారులు పర్యవేక్షణలో జరిగిన పూజల్లో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం



సుశీలమ్మ (పాత చిత్రం)

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్‌ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 565వ నేత్రదానం జరిగింది. ఇంకొల్లుకు చెందిన తోటకూర సుశీలమ్మ(88) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు ఎస్.రామమోహనరావు, జెట్టి స్వామి పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి దాత కార్నియాలను సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులను రోటరీ ప్రతినిధులు రఫీ, సాంబశివరావు, రాఘవరెడ్డి కమలేశ్వరరావు అభినందించారు.

'ఉపాధి'తో అభివృద్ధి పనులు

మార్టూరు, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పనులతో గ్రామాల్లో మెరుగైన అభివృద్ధి పనులు చేపట్టవచ్చని పంచాయతీ ఈవో టి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మార్టూరు పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచి సుమితాబాయి, తొండపు ఆదినారాయణ, అబ్దుల్ రాజక్, జంపని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పోపూరి సింగారావు, తహసీల్దార్ జే పంగులూరు



శ్రీనివాసమూర్తి, చినగంజాం ఎంపీడీవో

జే పంగులూరు, న్యూస్‌టుడే: మండల తహసీల్దార్‌గా పోపూరి సింగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన్ను జే పంగులూరు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ వెంకట మురళి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డి.నాగరాజారావును బదిలీ చేశారు. పలువురు తెదేపా నేతలు నూతన తహసీల్దార్‌ను అభినందించారు.

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం నూతన ఎంపీడీవోగా అద్దంకి శ్రీనివాసమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కొనకనమెట్ల ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై చినగంజాం వచ్చారు. ఈయన్ను మండల పంచాయతీరాజ్ ఏఈ దాసు, మండల పరిషత్ కార్యాలయ ఏవో సుదర్శనరావు, వేణు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కె.స్వరూపరాణి బదిలీపై జె.పంగులూరు ఎంపీడీవోగా వెళ్లారు.

వెలుగు ఏపీఎంగా మోహనరావు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు మండల ఏపీఎంగా టి.మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన మధుసూదనరావు చీరాలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మోహనరావును నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

బెండ.. బెంగ

ధర లేక గిట్టుబాటు కావడంలేదని రైతుల ఆవేదన

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన బెండ రైతుకు గిట్టుబాటు కావటం లేదు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేక హైదరాబాద్ మార్కెట్‌కు పంపినప్పటికీ ఆశించిన మేర ధర పలకడం లేదు. బల్లికురవ మండలం వైదన, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో బెండ సాగు చేశారు. ఎకరా తోటకు కనిష్ఠంగా రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది. మొక్కలు నాటిన నాటి నుంచి వ్యవసాయ, సస్యరక్షణ చర్యలు, రసాయన మందులు, కాంప్లెక్స్ ఎరువులు వంటివాటితో పెట్టుబడి మరింతగా పెరిగింది. పంట రావటం ప్రారంభించిన తరువాత ఏడు కోతల వరకు వస్తుంటుంది. ఆగస్టులో కిలో బెండ ధర రూ.6 మాత్రమే పలికింది. వినియోగదారుల వద్ద మాత్రం రూ.30-రూ.40 వసూలు చేశారు. మార్టూరులో మార్కెట్ ఉన్నా హైదరాబాద్‌లో అయితే కొంతమేర అధిక ధర వస్తుందనే ఉద్దేశంతో కాయలన్నీ అక్కడకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నట్లు రైతు రుసుం ఏడుకొండలు తెలిపారు. ప్రస్తుతం వరదల కారణంగా మార్కెట్‌లో బెండకాయలు దిగుమతి తగ్గడం వల్ల కిలో ధర రూ.15 వరకు గిట్టుబాటు అవుతుంది. ఏదేమైనా కిలో రూ.20 అందడం ద్వారానే గిట్టుబాటు అవుతుందని రైతు వివరిస్తున్నాడు.



రైతు రుసుం ఏడుకొండలు



వైదనలో సాగు చేసిన బెండ తోట

గ్రామాభివృద్ధిపై దృష్టిపెట్టండి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనూష అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.60 లక్షలు ఉన్నాయన్నారు. సభ్యులు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, వినతి రూపంలో ఏపీపీకి అందజేయాలన్నారు. పరిశీలన అనంతరం ప్రాధాన్యక్రమంలో నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యుత్తు ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ కొణికిలో విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల తీగలు మార్పు చేయాలంటే తమకు తెలియజేయాలని చెప్పారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్ రాయితీపై అందజేయనున్న శనగల గురించి వివరించారు. సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం కావలసి ఉండగా సభ్యుల కోరంలేక ఒంటిగంటకు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు, నూతనంగా నియమితులైన ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు సభ్యులు, అధికారులు హాజరుకాలేదు.

మంత్రి రామానాయుడును కలిసిన తిరుపతిరావు

మార్టూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నవతరం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు నల్లమల తిరుపతిరావు గురువారం మంగళగిరి తెదేపా కార్యాలయంలో కలిసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలకు సాగు, తాగు నీటి జలాలు పుష్కలంగా విడుదల చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశామన్నారు.

సంపూర్ణ దాణా సద్వినియోగం చేసుకోవాలి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం విజయనగర్ కాలనీలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఏడీ ఎస్.చిట్టిబాబు మాట్లాడుతూ.. పశు పోషకులు సంపూర్ణ పశు దాణాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిలో రూ.15 ఉన్న ఈ మిశ్రమాన్ని రాయితీ పోను రూ.6.50కే అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశువులకు వైద్యం చేసి, ఇంజక్షన్లు అందించారు. పావని, రత్నకుమార్, అన్వేష్ పాల్గొన్నారు.

పచ్చి రొట్ట పైర్లతో ప్రయోజనం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పచ్చి రొట్ట పైర్లు పెంచి పొలాన్ని కలియదున్నడం ద్వారా గణనీయంగా భూసారాన్ని పెంచుకోవచ్చని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్నకుమారి సూచించారు. చీరాల మండలం ఈపూరుపాలెం, విజయనగర కాలనీ గ్రామాల్లో సాగవుతున్న పొలాలను గురువారం పరిశీలించారు. మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏవో సుమతి, ఏడీహెచ్ చిట్టిబాబు, ఉద్యాన అధికారి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సొసైటీగా ఏర్పడితే ప్రభుత్వం చేయూత

వేటపాలెం, న్యూస్‌టుడే: సొసైటీగా ఏర్పడితే ప్రభుత్వ పరంగా చేయూతనిస్తోందని మత్స్యశాఖ ఏడీ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. రామన్నపేట పంచాయతీ పార్వతీపురంలో గురువారం యానాది మత్స్యకార సొసైటీ ఏర్పాటుకు కావాల్సిన అర్హతలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎఫ్‌డీవో రవీంద్ర, సొసైటీ అధ్యక్షుడు చేవూరి నాగబాబు, డైరెక్టరు సుబ్బారావు, వెంకటప్రసాదు, సంజీవరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేరువైన వైద్య సేవలు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు ఎస్టీ కాలనీలో గురువారం పేదలకు వైద్యసేవలు చేరువయ్యాయి. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ సురేష్ సీజనల్ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలపై అవగాహన కల్పించారు.

ఆధునిక సాగు విధానాలతో లాభసాటి



జే పంగులూరు మండలం అలవలపాడు ఏవో సుబ్బారెడ్డి

అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాల రైతుల పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఉప్పలపాడు సచివాలయం వద్ద రైతులతో ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డ్రోన్ విధానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఔత్సాహిక రైతు సంఘాల ప్రతినిధులు దాని కోసం దరఖాస్తు చేసుకుంటే రాయితీ అందుతుందన్నారు.

★ బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోందిలో ఏవో ఎస్‌వీపీ.కుమారి పాల్గొన్నారు.

★ జే పంగులూరు అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో డి.సుబ్బారెడ్డి అధ్యక్షతన మినుము పంటలను పరిశీలించారు

పర్చూరు, కారంచేడు (మార్టూరు), మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: రైతులు ఎప్పటికప్పుడు భూములను దుక్కిదున్ని సారవంతంగా మలుచుకోవాలని పర్చూరు, మార్టూరు ఏడీఏలు మోహనరావు, శ్రీనివాసరావు తెలిపారు. పర్చూరు, కారంచేడు, మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని కేశవరప్పాడు, రంగప్పనాయుడువారిపాలెం, వీరన్నపాలెం, కొమర్నేనివారిపాలెం, పూనూరు, పోలూరు, మార్టూరు ప్రాంతాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవోలు వీరగంధం కిరణ్‌కుమార్, సుధీర్‌బాబు, ఆదినారాయణ, పశువైద్యులు శారద, పద్మావతి, రమాదే పాల్గొన్నారు.

ఇడుపులపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: పశుపోషణలో మెలకువలు పాటించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎన్.భార్గవ సూచించారు. ఇడుపులపాడులో జరిగిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఉద్యాన శాఖ అధికారి రవిప్రకాష్ మాట్లాడారు. మార్కెట్ కమిటీ పక్షాన సుబ్బారావు పాల్గొన్నారు.

పల్లెపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: పల్లెపాలెంలో జరిగిన 'పొలం పిలుస్తోంది'లో ఏవో కె.భాస్కరరావు, ఫిషరీస్ సహాయకులు పుల్లారావు, సిబ్బంది కవిత, జస్వంత్, బాజీవలి పాల్గొన్నారు.

కుందుర్రు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: కుందుర్రులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయాధికారి అంజిరెడ్డి, ఏఈవో మాధురి పాల్గొన్నారు.

రెండు సచివాలయాల్లో ముగ్గురే సిబ్బంది

పమిడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఉన్నతస్థాయి అధికారులు హెచ్చరించినా.. మండలస్థాయి అధికారులు మొత్తుకున్నా వారు ఏమాత్రం లెక్కచేయడంలేదు. కొరిశపాడు మండలం పమిడిపాడులోని రెండు గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉదయం గంట ఆలస్యంగా వచ్చే సిబ్బంది సాయంత్రం మాత్రం మూడు గంటలకే ఇళ్లకు వెళ్తున్నారని చెబుతున్నారు. గురువారం 'న్యూస్‌టుడే' పరిశీలించగా మూడు గంటల సమయంలో రెండు సచివాలయాల్లో కలిపి ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు మాత్రమే కార్యాలయంలో ఉన్నారు. సిబ్బంది ఎవరైనా బయటకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దానిలో చూస్తే ఒకరు మాత్రమే బయటకు వెళ్లినట్లు రాశారు. మధ్యాహ్నం నుంచి సచివాలయంలోని సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రాజ్యలక్ష్మి వివరణ కోరగా సిబ్బంది సమయపాలనపై దృష్టిసారిస్తానని చెప్పారు. పమిడపాడు సచివాలయంలో లేనివారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఒక్కరే సిబ్బంది ఉన్న పమిడిపాడు సచివాలయ కార్యాలయం

మురుగు చెంతే పడిగాపులు

తిమ్మనపాలెం (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశంలో చెత్త, మురుగునీరు కలిసి దుర్వాసన వస్తోంది. గ్రోత్ సెంటర్‌లో వేలాది మంది కార్మికులు పనిచేస్తుంటారు. వారు తిరిగి వెళ్లేందుకు ఈ ప్రదేశంలోనే బస్సు కోసం వేచి ఉండాలి. దీంతో ప్రయాణికులు అక్కడ వస్తున్న దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.



ముఖ్యనాయకులతో సమావేశం

వేటపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని ముఖ్య నాయకులతో వైకాపా నియోజకవర్గ బాధ్యుడు కరణం వెంకటేష్ గురువారం రాత్రి స్థానికంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. బొడ్డు సుబ్బారావు, కర్న లక్ష్మారావు, రామకృష్ణ ఉన్నారు.

వృద్ధుల అనుభవాలు యువతరానికి అవసరం

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: సమాజంలో వృద్ధుల అనుభవాలు యువతరానికి ఎంతోమేలు చేస్తాయని మండల ఉపాధ్యక్షురాలు కె.ప్రసన్న అన్నారు. గురువారం స్థానిక నేతాజీ వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

వరద బాధితులకు వితరణ

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండలంలోని విశ్రాంత ఉద్యోగి పోపూరి నరసింహారావు విజయవాడ వరద బాధితులకు రూ.12,500 చెక్కును అందజేశారు. దీన్ని గురువారం అనంతవరం గ్రామస్థుల ద్వారా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకి అందించారు.

5న కంటివైద్య శిబిరం

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కనగాల ఇంజినీరింగ్ కళాశాల వద్ద 5న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాజీ మహ్మమద్ ఖాసీమ్ సాహెబ్, మహమ్మద్ గాలబ్ సాహెబ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ సమ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

28 మద్యం సీసాల స్వాధీనం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని గొల్లపాలేనికి చెందిన గోపి వద్ద నుంచి 28 మద్యం క్వార్టర్ సీసాలను ఒకటో పట్టణ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని అరెస్ట్ చేసినట్లు సీఐ మారీడు శ్రీనివాసరావు తెలిపారు.